సాక్షి వికారాబాద్

ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



బాల్య వివాహాలను..

బాల్య వివాహాల అడ్డుకట్టకు పురోహితులు సహకరించాలని సాధన ఎన్జీఓ జిల్లా కో–ఆర్డినేటర్ రమేశ్‌యాదవ్ అన్నారు. 8లో▸



ఆధునికత వైపు అడుగులు

మున్సిపాలిటీల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి ఇంటికీ ఆన్‌లైన్‌లో డిజిటల్ నంబర్ కేటాయిస్తున్నారు. 8లో▸



కల్వర్టులతో భద్రం!

అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం ప్రయాణికుల పాలిట శాపంగా మారుతోంది. 9లో▸

న్యూస్‌రీల్

భూ సమస్యలు పరిష్కరించాలి

సీఎంను కోరిన కాంగ్రెస్ నాయకుడు సంతోష్ నాయక్



సీఎంతో సంతోష్ నాయక్

బొంరాస్‌పేట: మండలంలోని బాపల్లి తండాలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు సంతోష్ నాయక్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. శనివారం ముఖ్యమంత్రిని నగరంలోని ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు విన్నవించారు. అనంతరం సంతోష్ నాయక్ మాట్లాడుతూ.. తండాలోని పలువురు రైతులు ఏళ్ల తరబడి భూ సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ సమస్యను సీఎం దృష్టికి తేగా భూ భారతి చట్టం ద్వారా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బోర్డు విధి విధానాలను వివరించండి



మాట్లాడుతున్న బోర్డు ప్రతినిధులు

అనంతగిరి: సోషల్ జస్టిస్ అండ్ ఉమెన్ ఎంపవర్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో శనివారం వికారాబాద్ జిల్లా ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర చైర్మన్ దోర్నాల సత్యం మాట్లాడుతూ.. బోర్డు విధి విధానాలను ప్రతినిధులకు వివరించారు. సామాజిక న్యాయం కోసం చేయాల్సిన కృషిని, మహిళల సంక్షేమం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు వేమారెడ్డి, శిధర్, శ్రీధర్, వీరస్వామి, పాండుగౌడ్, రాములు, రాజేందర్‌గౌడ్, మహేష్, నర్సింలు, శ్రీనివాస్, అరుణ్, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రంతో నూతన కమిటీ సభ్యులు

అనంతగిరి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం వికారాబాద్ యూనిట్ ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఈ కమిటీ 2025 – 28 వరకు కొనసాగనుంది. అధ్యక్షుడిగా ఎం మాణిక్యప్రభు, కార్యదర్శిగా బుచ్చయ్య, ఫైనాన్స్ కార్యదర్శిగా సతీష్‌చంద్ర, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా బందెప్పగౌడ్, ఉపాధ్యక్షులుగా మొగులయ్య, జీవన్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా జాషువా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగభూషణం, పబ్లిసిటీ కార్యదర్శిగా సాయన్న, జిల్లా కౌన్సిలర్లుగా జనార్దన్, కిష్టయ్య ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు మాణిక్య ప్రభు మాట్లాడుతూ.. తమకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల హక్కుల సాధనం కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కోశాధికారి పెంటయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ సభ్యులు దివాకర్‌రెడ్డి, నాగయ్య బొన్నల బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగుకు సన్నద్ధం

పొలాలను చదును చేస్తున్న రైతన్న



ఆలేడ్‌లో పొలాలను సాగుకు సిద్ధం చేసిన రైతులు

దుద్యాల్: ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు పెరిగాయి. బోర్లలో సైతం నీళ్లు ఉన్నాయి. దీంతో రైతులు రబీ సాగుకు సిద్ధమవుతున్నారు. పొలాలను చదును చేసి పంటలు వేసేందుకు సమాయత్తమవుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో వేరుశెనగ, తెల్ల కుసుమ, మొక్కజొన్న, బొబ్బర్లు, శనగ వంటి పంటలు వేసే అవకాశం ఉంది.

ఉన్నవి సరిపోవు.. కొత్తవి కొనరు

మున్సిపాలిటీల్లో చెత్త సేకరణకు వాహనాల కొరత

పన్నులు, అనుమతుల రూపంలో మున్సిపాలిటీలకు ఏటా కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతోంది. జిల్లాలోని వికారాబాద్, తాండూరు పురపాలికలకు ఏటా రూ.10 కోట్ల పైనే ఆదాయం ఉంది. పరిగికి రూ.6 కోట్ల వరకు, కొడంగల్‌కు రూ.2 కోట్లు వరకు పన్నుల రూపంలో వస్తోంది. ఇంతటి ఆదాయం ఉన్నా చెత్త సేకరణకు వాహనాల కొనుగోలులో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఉన్నవి సరిపోక కొత్తవి రాకపోవడం, మరికొన్ని పాడవడంతో పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీల్లో చెత్త వాహనాల కొరతపై 'సాక్షి' ప్రత్యేక కథనం

- వెంటాడుతున్న కార్మికుల సమస్య
- ఒక్కో పురపాలికలో రోజుకు 6నుంచి 50టన్నుల చెత్త రాక
- సేకరణ, తరలింపునకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



తాండూరులో పాడైపోయిన చెత్త సేకరణ ఆటో



వికారాబాద్‌లో చెత్త సేకరణ

వికారాబాద్: మున్సిపాలిటీలో చెత్త సేకరణ పెద్ద సవాల్‌గా మారింది. నడిపడా వాహనాలు లేకపోవడం, కార్మికుల కొరత ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పన్నులు, అనుమతుల రూపంలో ఏటా కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా వాహనాల కొనుగోలుపై అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. వికారాబాద్ మున్సిపల్ పరిధిలో 34 వార్డులు.. 80వేల జనాభా ఉంది. రోజుకు సగటున 30 నుంచి 35 మెట్రిక్ టన్నుల చెత్త వస్తుంది. చెత్త సేకరణ, తరలింపు కోసం రెండు జేసీబీలు, ఆరు ట్రాక్టర్లు, 17 ఆటోలను వినియోగిస్తున్నారు. మరో 10 నుంచి 15 వాహనాల అవసరం ఉంది. 157 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. మరో 50 మంది వరకు అవసరం ఉన్నట్లు తెలుస్తోంది. వికారాబాద్‌లో తడి పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియ చేపట్టడం లేదు. కంపోస్టు ఎరువుల తయారీ యూనిట్ మూతబడింది. ఏ కాలనీలో చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. పట్టణ పరిధిలోని మార్కెట్, రైతు బజార్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా చెత్త పారబోస్తున్నారు.



పరిగి మున్సిపల్ కార్యాలయంలో మూలకు చేరిన చెత్త సేకరణ వాహనాలు

నిరుపయోగంగా.. చెత్త బండ్లు

పరిగి: పరిగి మున్సిపాలిటీలో చెత్త సేకరణకు సరిపడా వాహనాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టణ పరిధిలో 18 వార్డులు.. 40వేలకు పైగా జనాభా ఉంది. 48 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. 10 ఆటోలు, 3 ట్రాక్టర్లతో రోజుకు 8 టన్నుల చెత్త సేకరిస్తున్నారు. మూడు ఆటోలు చెడిపోయాయి. వాటికి మరమ్మతులు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పెరుగుతున్న కాలనీలు, జనాభాకు అనుగుణంగా మరో 3 ఆటోలు కొనుగోలు చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం పట్టణంలో చెత్త సేకరణ అధ్వానంగా మారింది. కాలనీల్లో చెత్త పేరుకుపోయింది.

మరో 14 అవసరం

కొడంగల్: మున్సిపల్ పరిధిలో కొడంగల్, పాత కొడంగల్, గుండ్లకుంట, బూల్కాపూర్, ఐనన్‌పల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో 12 వార్డులు, 18వేల జనాభా ఉంది. ఆయా గ్రామాల్లో చెత్త సేకరణకు నాలుగు ఆటోలు, రెండు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఒక్కో ఆటో రెండు గ్రామాల్లో చెత్త సేకరించి కొడంగల్ సమీపంలోని డంప్ యార్డుకు తరలిస్తున్నారు. రెండు ట్రాక్టర్లు కొడంగల్ పట్టణంలో తిరిగి చెత్తను డంప్ యార్డుకు తరలిస్తున్నాయి. గతంలో కొనుగోలు చేసిన నాలుగు ఎలక్ట్రికల్ వాహనాలు (ఆటోలు) ప్రస్తుతం పనిచేయడం లేదు. వాటిని వాటర్ ట్యాంకు దగ్గర ఉంచారు. మున్సిపల్ పరిధిలో జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కొడంగల్‌లో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం ఉన్న వాహనాలు సరిపోవడం లేదు. కొడంగల్‌కు 8 ఆటోలు, గ్రామాల్లో చెత్త సేకరణకు మరో 6 ఆటోలు అవసరం ఉన్నట్లు తెలిసింది. పారిశుద్ధ్య కార్మికులకు సోపులు, ఇతర వస్తువుల కోసం డబ్బులు చెల్లిస్తున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.



కొడంగల్ మూలకు చేరిన చెత్త సేకరణ వాహనాలు

పేరుకే పెద్ద మున్సిపాలిటీ..



తాండూరులో చెత్త సేకరిస్తున్న కార్మికులు

తాండూరు: జిల్లాలోనే తాండూరు అతి పెద్ద మున్సిపాలిటీ.. 36 వార్డులు.. 19 వేల గృహాలు, 95 వేల జనాభా ఉంది. ఆయా వార్డుల్లో చెత్త సేకరణకు 280 మంది పారిశుద్ధ్య కార్మికులు అవసరం. ప్రస్తుతం 49 మంది రెగ్యులర్, 171 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో దాదాపు 50మంది మున్సిపల్ కార్యాలయంలోని ఇతర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయా వార్డుల నుంచి రోజూ 40 టన్నుల చెత్త వస్తోంది. ఇందుకోసం 36 ఆటోలు, 16 ట్రాక్టర్లు అవసరం కాగా కేవలం 24 ఆటోలు, 9 ట్రాక్టర్లు మాత్రమే ఉన్నాయి. వీటిలో 10 ఆటోలు, రెండు ట్రాక్టర్లు పని చేయడం లేదు. దీంతో చెత్త సేకరణ సిబ్బందికి భారంగా మారింది. పారిశుద్ధ్య కార్మికులకు శానిటరీ కిట్లు కూడా అందడం లేదు. రెండు నెలల క్రితం కిట్ల కొనుగోలుకు రూ.50 లక్షలు కేటాయించారు. అందులో అవినీతి జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు చెత్త సేకరణ వాహనాల కొనుగోలుపై, సిబ్బంది నియామకంపై దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

27వేల కేసులు పరిష్కారం

- లోక్ అదాలత్‌కు విశేష స్పందన
- రాజీమార్గమే రాజమార్గం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: లోక్ అదాలత్‌కు వచ్చే ఇరువర్గాలు విజయం సాధించినట్లేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్. సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ కోర్టుల పరిధిలో మొత్తం 27వేల కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఇందులో ట్రాఫిక్ చలాన్లు, ఎలక్ట్రిసిటీ, ఈ – పిట్టీ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, బ్యాంకులు, చిన్న చిన్న తగాదాలు తదితర కేసులు ఉన్నాయన్నారు. ఇరువర్గాలు విశాల దృక్పథంతో ఆలోచిస్తే లోక్ అదాలత్ ద్వారా కేసుల నుంచి విముక్తి పొందవచ్చని తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమన్నారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని సూచించారు. కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జిల్లా న్యాయసేవ సెక్రటరీ, సీనియర్ సివిల జడ్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శాంతిలత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వైష్ణవి, ఎస్పీ నారాయణరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజు, సీనియర్ న్యాయవాదులు మాధవరెడ్డి, నాగరాజు, వెంకటేష్, శ్రీనివాస్, పీపీలు మేరాజ్‌బేగం, అన్వేష్‌సింగ్, సమీనాబేగం, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐలు భీంకుమార్, వెంకట్, రఘురాం, పలువురు అధికారులు, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారం కోసమే..

కొడంగల్ రూరల్: కేసుల సత్వర పరిష్కారం కోసమే మెగా లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు కొడంగల్ మున్సిఫ్ కోర్టు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి బి.శ్రీరామ్ తెలిపారు. శనివారం పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 152 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న చిన్న తగాదాలను కక్షిదారులు సమన్వయంతో పరిష్కరించుకునేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు బస్వరాజ్ అడ్వకేట్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, న్యాయవాదులు ఏవీ ఆనంద్, రవీందర్ నాయక్, బీ వెంకటయ్య, టీ రాములు, కృష్ణయ్య, రమేష్, భానుప్రసాద్, భాగ్యలత తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో 261 కేసులకు..

పరిగి: జాతీయ లోక్ అదాలత్‌కు మంచి స్పందన వచ్చిందని పరిగి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ నాగులశిల్ప తెలిపారు. శనివారం పరిగి కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 261 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజీపీ బాలముకుందం, లోక్ అదాలత్ సభ్యులు బి.లింగం, శివారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇబ్రహీంఖాన్, సీనియర్ న్యాయవాదులు ఆనంద్ గౌడ్, వెంకట్ రాములు, నర్సింహారెడ్డి, గౌస్‌పాషా, శ్రీనివాస్ యాదవ్, గోపాల్, వెంకటేశ్, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ మోహనకృష్ణ పాల్గొన్నారు.

70 కేసులకు పరిష్కారం

తాండూరు: జాతీయ లోక్ అదాలత్‌లో 70 కేసులకు పరిష్కారం లభించింది. శనివారం తాండూరు కోర్టులో మండల్ లీడల్ అథారిటీ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ శివలీల, అడిషనల్ జడ్జి అంబటి ప్రణయ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. సివిల్ కేసులు 2, సీసీ క్యాలెండర్ కేసులు 21, చెక్ బౌన్స్ కేసులు 2, నేరం ఒప్పుకోలు 14, ప్రాథమిక విచారణలో గల కేసులు 15, ఎక్సైజ్ శాఖకు చెందిన 16 కేసులకు పరిష్కారం కల్పించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అన్వేష్ సింగ్, లోక్ అదాలత్ సభ్యులు మనోహర్‌రావు, ఎం.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి


- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

అనంతగిరి: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాల ఎస్టీ, మైనార్టీ విభాగం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ముస్లింలకు మంత్రివర్గంలో చోటు ఇవ్వని పార్టీ కాంగ్రెస్ అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి జరిగిందన్నారు. అన్ని వర్గాలకు కేసీఆర్ సమాన్యాయం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడు గయాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు అశోక్, సీనియర్ నాయకులు పురుషోత్తంరెడ్డి, శివకుమార్, చాంద్‌పాషా, హైమద్ పాషా, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ను సన్మానించిన నాయకులు

వెంకన్న కోవెలకు రూ.110 కోట్లు



కొడంగల్‌లోని శ్రీవారి ఆలయం



మూలమూర్తి

- వైఖానస శాస్త్రోక్తంగా విస్తరణ పనులు
- ఇళ్లు కోల్పోయే వారికి పరిహారం
- త్వరలో ప్రారంభం కానున్న పనులు

కొడంగల్: పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని రూ.110 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. భూసేకరణ కోసం ప్రభుత్వం మొదటి విడతలో రూ.33 కోట్లు మంజూరు చేసింది. నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా విస్తరణతో పాటు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. రెండేళ్లలోపు పనులు పూర్తి చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, వాస్తు నిపుణులు శ్రీవారి ఆలయ విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆలయ పునరుద్ధరణ పనుల్లో భాగంగా దేవాలయ నిర్మాణంతో పాటు వివిధ పనులకు స్థపతిలు రూపొందించిన నక్షలను ముఖ్యమంత్రి ఆమోదించారు. భక్తులకు మౌలిక వసతులు కల్పించనున్నారు. తిరుమల తరహాలో వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా అభివృద్ధి చేయడానికి రంగం సిద్ధం చేశారు. క్యూలైన్, కల్యాణ మండపం, కల్యాణ కట్ట, పూజా మందిరాలు, వసతి గదులు, స్నాన ఘట్టాలు, మరుగుదొడ్లు, పార్కింగ్, పుష్కరిణి, ప్రసాదం కౌంటర్లు, మాడ వీధుల విస్తరణ వంటి పనులు చేపట్టనున్నారు.

గుడి విస్తరణకు రెండు ఎకరాలు

కొడంగల్ శ్రీవారి ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. 87,36 గజాల స్థలం సేకరించి అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించనున్నారు. ఇళ్లు కోల్పోయే వారికి ప్రత్యేక ప్యాకేజీతో పాటు 125 గజాల ప్లాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తారు. నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని అధికారులు తెలిపారు. భూమి విలువ, భవనం విలువను ఆర్ అండ్‌బీ అధికారులు లెక్క కట్టి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేశారు. అదనంగా రూ.5 లక్షల సాయం, ఒక ఏడాది కుటుంబ అవసరాల కోసం రూ.40 వేలు, ఇల్లు ఖాళీ చేసి వెళ్లడానికి అయ్యే ఖర్చు (ట్రాన్స్‌పోర్ట్)రూ.60 వేలు, పశువుల దొడ్డి నిర్వహణకు రూ.25 వేలు, చేతి వృత్తులు, కుల వత్తుల వారికి రూ.30 వేలు, ఇతర ఖర్చుల కోసం రూ. 60వేలు చెల్లిస్తారు. ఇంటి స్థలాన్ని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారు.

యూరియా 'బ్లాక్'!

పరిగి: యూరియా కోసం ఓ వైపు రైతులు పడరాని పాట్లు పడుతుంటే ఫర్టిలైజర్ దుకాణదారులు మాత్రం బ్లాక్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రిపూట అధిక ధరలకు అమ్ముతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణ కేంద్రంలోని చిన్నారి ఆస్పత్రి పక్కన ఉన్న గోదాం నుంచి శనివారం రాత్రి దుకాణదారుడు యూరియాను ఆటోలో తరలిస్తుండగా ఓ రైతు వీడియో తీసి వాట్సప్‌లో వైరల్ చేశాడు. ఒక్క బస్తా కోసం పగలురాత్రి తేడాలేకుండా తాము లైన్‌లో నిలబడినా, స్టాక్ అయిపోయిందని వెనక్కి పంపిస్తూ.. ఇలా రాత్రి వేళ బ్లాక్ మార్కెట్‌కు తరలించడం ఏమిటని రైతులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



పరిగిలో శనివారం రాత్రి ఆటోలో తరలిస్తున్న యూరియా బస్తాలు



సమావేశంలో మాట్లాడుతున్న అబ్బాస్

వాస్తవాలు తెలుసుకోవాలి

- అవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్బాస్

తుర్కయంజాల్: మేధావులు మౌనంగా ఉంటే చరిత్రను వక్రీకరించే అవకాశం ఉంటుందని, ప్రజలకు అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అవాజ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అబ్బాస్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శనివారం తుర్కయంజాల్‌లోని అరుణ కన్వెన్షన్ హాల్‌లో 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం– వాస్తవాలు, వక్రీకరణ' అంశంపై టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ.. 1946 సెప్టెంబర్ 11న ప్రారంభమైన సాయుధ పోరాట పిలుపు చారిత్రక మలుపుగా నిలిచిందని, ఈ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర ఎనలేనిదని గుర్తు చేశారు. నిజాం ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ఎంతో మంది కమ్యూనిస్టులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఆ పోరాట ఫలితంగానే తెలంగాణలో నిజాం పాలన అంతం కావడం, ప్రజలకు వెట్టి చాకిరి నుంచి విముక్తి లభించడం, పేదలకు వ్యవసాయ భూమి దక్కాయని అన్నారు. బీజేపీ ఏటా సెప్టెంబర్ వచ్చిందంటే చాలు తామే సాయుధ పోరాటాన్ని నడిపినట్లు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్యలను కూడా అవమానించేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. నేటి తరం యువత వాస్తవాలను గ్రహించి, చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, ఉపాధ్యక్షుడు బింగి రాములయ్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుగంధ, సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వర్షాలకు కూలిన ఇల్లు



కూలిన ఇల్లును చూపిస్తున్న బాధితురాలు

పరిగి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఓ ఇల్లు కూలింది. పట్టణ కేంద్రంలోని వల్లభనగర్ కాలనీలో షమీబేగంకు చెందిన ఇల్లు వర్షానికి శుక్రవారం రాత్రి కూలిపోయింది. కొన్నేళ్ల క్రితం ఆమె భర్త చనిపోవడంతో నలుగురు పిల్లలలో ఉన్న చిన్నపాటి ఇంట్లో ఉంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఇల్లు కూలడంతో కుటుంబం మొత్తం రోడ్డున పడాల్సి వచ్చిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే తమని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులపై శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న అధికారి పాండు

కొడంగల్ రూరల్: విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని షెడ్యూల్డ్ కులాల సహాయ అభివృద్ధి తాండూరు డివిజన్ అధికారి వి.పాండు సూచించారు. శనివారం పట్టణంలోని ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాలను ఆయన పరిశీలించారు. అక్కడ కల్పిస్తున్న వసతులను వివరించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నట్లు, వసతి గృహం నుంచి విద్యార్థులకు అందించే వస్తువులు, స్పెషల్ తరగతులు తదితర విషయాలను వివరించారు. చదువులో వెనకబడిన వారికి ప్రత్యేక తరగతులతో బోధనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారులు హన్మంత్‌రెడ్డి, వరలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

బొంరాస్‌పేట: మండల కేంద్రం శివారులో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన సంఘటన జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కోస్గి మండలం తొగాపూర్‌కు చెందిన బొప్పలి వెంకటేశ్ శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో బొంరాస్‌పేట చెరువు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్ కాళ్లు, చేతులు విరిగి ఆస్పత్రి పాలయ్యాడు. క్షతగాత్రుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల వెంకటరమణ తెలిపారు.

వరద ఉధృతితో రాకపోకలకు అవస్థలు



వాగు వద్ద రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

ధారూరు: మండల కేంద్రంలో శనివారం జరిగిన కూరగాయల సంతకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు, మహిళలు వాగు ఉధృతితో తిరిగి వెళ్లలేకపోయారు. భారీ వర్షానికి చింతకుంట– హరిదాస్‌పల్లి రోడ్డు మీదుగా ప్రవహించిన వాగు వద్దే ఆగిపోయారు. రాత్రి 7 గంటలైనా వరద తీవ్రత తగ్గకపోవడంతో అక్కడే కూర్చుండిపోయారు. పాలకులు స్పందించి, వాగులపై కల్వర్టులు నిర్మించాలని కోరారు.

యూరియా ఇవేం వెతలయా!



ధారూరు: మోమిన్‌ఖుర్దులో యూరియా కోసం క్యూలైన్‌లో రైతులు



దోమ: మోత్కూర్ ఆగ్రోస్ కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

ఎండా, వానలకు ఎదురొడ్డి ఆరుగాలం శ్రమించి సిరులు పండించే అన్నదాతలకు యూరియా వెతలు వెంటాడుతూనే ఉన్నాయి. శనివారం సైతం సరిపడా యూరియా బస్తాలు దొరకక ఫర్టిలైజర్ దుకాణాలు, ఆగ్రో సెంటర్ల ఎదుట బారులు తీరారు. పలుచోట్ల భారీ సంఖ్యలో రైతులు తరలివచ్చి ఆందోళన చేపట్టారు. అనంతరం అధికారుల సమక్షంలో యూరియా పంపిణీ సామరస్యంగా జరిగింది.

- ఇష్టానుసారంగా టోకెన్లు ఇస్తున్నారని ఆగ్రహం
- పలుచోట్ల ఆందోళన చేపట్టిన రైతులు
- దుకాణాల ఎదుట కర్షకుల పడిగాపులు
- క్యూ లైన్లలో చెప్పులు ఉంచి నిరీక్షణ

ధారూరు: మండల పరిధిలోని మోమిన్‌ఖుర్దు గ్రామంలో రైతులు యూరియా కోసం ఆగ్రో సెంటర్ వద్ద శనివారం తెల్లవారుజాము నుంచే క్యూ కట్టారు. టోకెన్లు ఇష్టారాజ్యంగా ఇవ్వడం, అసలైన వారికి దొరక్కపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వందల సంఖ్యలో రైతులు రాగా ఏఈఓ పత్తా లేకపోవడం, ఏఈఓ ఒక్కడే ఇష్టానుసారంగా టోకెన్లు జారీ చేయడంతో అన్నదాతలు ఆందోళనకు దిగారు. శనివారానికి 251, సోమవారానికి 200 టోకెన్లు ముందుగానే జారీచేశారు. క్యూలైన్‌లో చెప్పులు పెట్టి మరీ రైతులు వేచి ఉన్నారు.

తప్పని యూరియా కష్టాలు!

దోమ: చాలీచాలని యూరియా సరఫరాతో రైతులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. రెండు, మూడు రోజులకు ఓ లారీలో ఆగ్రోస్ కేంద్రాలకు కొంతమేర యూరియాను సరఫరా చేస్తూ అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. శనివారం మండల పరిధిలోని మోత్కూర్ ఆగ్రోస్ కేంద్రంతో పాటు దిర్సంపల్లిలోని ఆగ్రోస్ కేంద్రానికి 30 టన్నుల యూరియాను అధికారులు సరఫరా చేశారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో రైతులు బారులు తీరి పట్టా పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులను క్యూలైన్‌లో పెట్టి వేచి ఉన్నారు. అందులో కొంత మందికి మాత్రమే యూరియా అందడంతో మిగతా వారు అధికారులపై మండి పడ్డారు. రాష్ట్రంలో రైతులను విస్మరించి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే సరిపడా యూరియాను అందించేందుకు చర్యలు తీసుకోవాలంటున్నారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరిస్తున్నారు.



ధారూరు: చెప్పులతో క్యూ లైన్

బాల్య వివాహాలను నిరోధించాలి

సాధన స్వచ్ఛంద సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ రమేశ్‌యాదవ్



తాండూరుటౌన్: పురోహితులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రమేశ్‌యాదవ్

తాండూరు టౌన్: బాల్య వివాహాల అడ్డుకట్టకు పురోహితులు సహకరించాలని సాధన ఎన్జీఓ జిల్లా కో–ఆర్డినేటర్ రమేశ్‌యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ భావిగి భద్రేశ్వర దేవాలయం, శ్రీకాళికాదేవి ఆలయంలో పురోహితులచే బాల్యవివాహాల నిర్మూలనకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలకు 18ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండిన తర్వాత మాత్రమే పెళ్లి జరిపించాలన్నారు. బాలికలకు బాల్య వివాహం చేయడంతో వారి మానసిక స్థితి, జీవన విధానంలో పెను మార్పులు సంభవించే ప్రమాదం ఉందన్నారు. సహజ సిద్ధమైన జీవనం కొనసాగించడంలో ఇబ్బందులకు గురవుతారన్నారు. కావున పురోహితులు, పాస్టర్లు, ఖాజీలు బాల్య వివాహాలకు సహకరించ రాదన్నారు. సమాజంలో ఎక్కడైనా బాల్య వివాహం జరిగే క్రమంలో వెంటనే 1098 లేదా 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సాధన సంస్థ ప్రతినిధులు నర్సిములు, రమేశ్, రోజా, శ్రీనివాస్‌రెడ్డి, పురోహితులు కిరణ్, తిరుమలరావు, జగదీశ్వర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వాలి

తాండూరు రూరల్: సమాజంలో బాల్య వివాహాలను రూపుమాపాలని సాధన సచ్ఛంద సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ రమేశ్‌యాదవ్ సూచించారు. శనివారం మండలంలోని భూకైలాస్ దేవస్థానంలో బాల్య వివాహాలను అరికట్టాలని పూజారులతో ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్‌లైన్ 1098, పోలీస్ 100కు కాల్ చేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సాధన సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీ నేతకు శుభాకాంక్షల వెల్లువ



తాండూరు టౌన్: పట్టణంలో కేక్ కట్ చేస్తున్న బీసీ సంఘం నాయకులు



అనంతగిరి: ఘనంగా జన్మదిన వేడుకలు, పాల్గొన్న బీసీ నాయకులు

ఘనంగా ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు

తాండూరు టౌన్: బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలను శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ మహిళా సంఘం నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకొన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోని 25వ వార్డు చిన్నారులకు బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ బ్యాగులు, పలకలు పంపిణీ చేశారు. బీసీల అభ్యున్నతి కోసం అహర్నిషలు కృషి చేస్తున్న గొప్ప వ్యక్తి కృష్ణయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా సంఘం తాండూరు అధ్యక్షురాలు అనిత, మాజీ కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్, నాయకులు షుకూర్, సాయప్ప, వెంకటేశ్, బస్వరాజ్, నర్సమ్మ, మంజుల, విజయలక్ష్మి, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తరలివెళ్లిన నాయకులు..

అనంతగిరి: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఆర్.కృష్ణయ్య జన్మదినాన్ని శనివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లిన బీసీ నేతలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఆర్.కృష్ణ, జిల్లా కార్యదర్శి అనంతయ్య, మల్లేశం, పాండు, పెంటయ్య తదితరులు ఉన్నారు.

యూరియా దందాపై షోకాజ్

ఫర్టిలైజర్ షాప్ యజమానికి నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

బషీరాబాద్: అధిక ధరలకు యూరియా విక్రయించిన సాయి ధనలక్ష్మి ఫర్టిలైజర్ షాపు యజమానిపై చర్యలకు వ్యవసాయ అధికారులు సిద్ధమయ్యారు. శనివారం 'యూరియా దందా.. రైతు బెంగ' శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి బషీరాబాద్ వ్యవసాయ అధికారిణి అనిత స్పందించారు. ఈ మేరకు షాపు యజమాని రాఘవేందర్ రెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నోటీసులో మూడు అంశాలపై లిఖిత పూర్వక సమాధానం ఐదు రోజుల్లో ఇవ్వాలని ఆదేశించారు. ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్(ఎఫ్‌సీఓ) 1985 చట్టం ప్రకారం యూరియా బస్తా ధర రూ.266.50గా నిర్ణయిస్తే రైతులకు అంతకంటే ఎక్కువ ధరకు ఎందుకు విక్రయించారని, ఫర్టిలైజర్ షాపు ముందు ధరల పట్టిక ఎందుకు ఏర్పాటు చేయలేదని, అలాగే రైతులకు రసీదులు ఎందుకు ఇవ్వలేదో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. రైతులను మోసం చేస్తే లైసెన్సు రద్దు ఎందుకు చేయరాదని హెచ్చరించారు. సాయిధన లక్ష్మి ఫర్టిలైజర్ షాపులో డీఏపీ బస్తాకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.1,350కు బదులు రూ.1,450 విక్రయిస్తున్నారు. ఇదే విషయమై వ్యవసాయ అధికారులకు రైతులు పలుమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదని మండిపడుతున్నారు.



షోకాజ్ నోటీసు

పురుగు మందు తాగి డ్రైవర్ ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కుర్మల్‌గూడ రాజీవ్ గృహకల్పలో నివాసం ఉండే మోతిలాల్(40) డ్రైవర్ పని చేసుకుంటూ జీవించేవాడు. కుటుంబ కలహాలతో ఈ నెల 8వ తేదీన పురుగు మందు తాగాడు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆయన మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

బతుకుపోరాటంలో ఆగిన గుండె



అశోక్ (ఫైల్)

కందుకూరు: బతుకు పోరాటంలోనే ఓ గుండె ఆగిపోయింది. మండల పరిధిలోని కటికపల్లికి చెందిన ఎంట్ల అశోక్(35) టిప్పర్‌పై డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం ఉదయం గ్రామ సమీపంలోని క్రషర్ మిషన్ వద్ద డస్ట్ లోడ్ నింపుకొని బయలుదేరాడు. మార్గమధ్యలో ఛాతిలో నొప్పి రావడంతో వాహనాన్ని పక్కకు నిలిపేసి, డ్రైవింగ్ సీట్లోనే ప్రాణం వదిలాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. అశోక్ మృతితో వీరంతా దిక్కులేని పక్షులయ్యారు. అందరితో కలివిడిగా ఉండే వ్యక్తి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ధారూరులో మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

దారుస్సలాంకు తరలిన ముస్లింలు



ధారూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఐఎం నాయకులు

ధారూరు: మండల కేంద్రంలో శనివారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జామ మసీదు నుంచి కమాన్, బస్టాండు మీదుగా లతీపున్నీసా మసీదు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. గత 26 సంవత్సరాల నుంచి హైదరాబాద్ నగరంలోని దారుస్సలాం వరకు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలంలోని మోమిన్‌కలాన్, నాగారం, దోర్నాల్, స్టేషన్ ధారూరు, కుక్కింద, కేరెల్లి, ధారూరు, ఎబ్బనూర్ తదితర గ్రామాల నుంచి ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు హాజరైనట్లు వివరించారు. దారుస్సలాంలో రాత్రంతా జాగారం, ప్రత్యేక ప్రార్థనలు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ధారూరు ఎంఐఎం అధ్యక్షుడు మోయిజ్‌ఖురేషి, పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ రహీం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాగులో కలుస్తున్న ప్రాణాలు!

- సంగెంకలాన్ చుట్టూ పారుతున్న దిడ్డివాగు, డీపో వాగు
- గ్రామంలోకి వెళ్లాలంటే వీటిని దాటాల్సిందే
- వర్షాకాలంలో తరచూ ప్రమాదాలు
- వంతెనలు నిర్మించాలని ప్రజల అభ్యర్థన



వాగు వద్ద ఇరువైపులా కట్టిన తాడు

తాండూరు రూరల్: మండలంలోని తెలంగాణ–కర్ణాటక సరిహద్దులో ఉన్న సంగెంకలాన్ గ్రామ దుస్థితిపై స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వానాకాలం వచ్చిందంటే దినమొక గండంగా గడపాల్సిందేనని వాపోతున్నారు. వర్షం కురిస్తే చాలు ఊరి చుట్టూ ఉన్న వాగులు పొంగిపొర్లుతాయని చెబుతున్నారు. వరద ఉధృతిని అంచనా వేయలేక గ్రామానికి చెందిన పలువురు వరదలో కొట్టుకుపోయి చనిపోయారని చెబుతున్నారు. గత గురువారం దిడ్డివాగులో కొట్టుకుపోయిన మొగులప్ప శుక్రవారం శవమై తేలిన విషయం తెలిసిందే. మూడేళ్ల క్రితం డిపో వాగులో పడి భిక్షంపల్లి పెంటప్ప మృతిచెందాడు. ప్రమాదానికి గురైన మరి కొంత మంది ప్రాణాలతో బయటపడ్డారు. ఏటా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కర్ణాటక సరిహద్దులో ఉన్న తమ గ్రామం శివారులోంచి పారుతున్న వాగులపై వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు.

స్కావెంజర్ల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రయ్య

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కావెంజర్లకు 11 నెలలుగా వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు విన్నవించినా పరిష్కారం కావడం లేదన్నారు. వెంటనే స్కావెంజర్ల సమస్యలు తీర్చాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వెంకటప్ప, కార్యదర్శిగా సయ్యద్ అలీ, ఉపాధ్యక్షుడిగా నర్సిములు, సహాయకార్యదర్శిగా బుగ్గప్పలతో పాటు కమిటీని ఎన్నుకున్నారు.

కొనుగోళ్లు అరకొరే



ధారూరు సంతలో కురుస్తున్న వాన

ధారూరు: ధారూరులో శనివారం జరిగిన కూరగాయల సంతలో ఉదయం నుంచి నిరవధికంగా కురిసిన వానకు రైతులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెరిపీయని వానతో విక్రయాలు మందగించాయి. దీంతో రైతులు తెచ్చిన కూరగాయలను వెనక్కి తీసుకెళ్లారు.

కత్తులు దూసిన కుటుంబ కలహాలు

- వ్యక్తికి తీవ్ర గాయాలు
- పోలీసుల అదుపులో నిందితులు



దాడిలో గాయపడిన పృథ్వీరాజ్

షాద్‌నగర్ రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై కత్తులతో దాడి చేసిన ఘటన శనివారం ఉదయం షాద్‌నగర్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని ఆకాశకాలనీకి చెందిన కాంట్రాక్టర్ గంతల ప్రభుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య కుమా రుడు పృథ్వీరాజ్ తన కొడుకుతో కలిసి శనివారం ఉదయం బైక్‌పై పట్టణ శివారులోని ఓ డెయిరీ ఫాంకు వెళ్లి, పాలు తీసుకొని ఇంటికి వస్తున్నాడు. కేశంపేట రైల్వే గేటు మ లుపు వద్ద మాటువేసిన ప్రభు రెండో భార్య కుమారులు సందీశ్వర్, భరత్ అతనిపై కత్తులతో దాడి చేసి, పరారయ్యారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసుకు సమాచారం అందించారు. రక్త గాయాలతో కింద పడిన పృథ్వీరాజ్‌ను చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభు త్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ గొడవలే దాడికి కారణమని బాధితుడు తెలిపాడు ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఆధునికత వైపు అడుగులు

ప్రతి ఇల్లూ ఆన్‌లైన్‌లో నమోదు

- ఆస్తి హక్కుపై పూర్తి భద్రత
- మున్సిపాలిటీల్లో జవాబుదారీతనం
- చర్యలు చేపట్టిన పుర అధికారులు



కొడంగల్ పట్టణ చిత్రం

కొడంగల్: మున్సిపాలిటీల్లో కఠిన నిబంధనలు అమలు చేయబోతున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి ఇంటికి ఆన్‌లైన్‌లో డిజిటల్ నంబర్ కేటాయిస్తున్నారు. ఆస్తి హక్కుపై ప్రజలకు భరోసా కల్పించడానికి రేవంత్ సర్కార్ శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీల్లో పారదర్శకత.. జవాబుదారీతనం ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం అధికారులు తప్పు చేసినా.. ఇంటి యజమాని తప్పు చేసినా.. ఎవరు తప్పు చేసినా ఇంటి యజమానిదే బాధ్యత. ఇంటి నిర్మాణ విషయంలో మున్సిపల్ చట్టాన్ని అతిక్రమిస్తే పాతిక రేట్లు జరిమానా విధించనున్నారు.

ఆచరణలోకి డిజిటలైజేషన్

కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం ప్రతి ఇల్లు ఆన్‌లైన్‌లో ఉండాలి. ఆన్‌లైన్‌లో లేని ఇంటికి జరిమానాలు విధించే అధికారం మున్సిపల్ సిబ్బందికి ఉంది. ప్రతి ఇంటికి డిజిటల్ నంబర్ ఉండాలి. నంబర్‌తో ఆస్తులకు భద్రత లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. మున్సిపాలిటీల్లో ఆన్‌లైన్ సేవలను మరింత అందుబాటులోకి తెచ్చారు. ఈ క్రమంలోనే ఇళ్లకు నూతన డిజిటలైజేషన్ విధానం ఆచరణలోకి వచ్చింది. ప్రతి ఇంటికి డిజిటల్ నంబర్లు కేటాయించాలని మున్సిపల్ శాఖ నిర్ణయించింది. దీని ద్వారా యజమాని ఇంటి వివరాలతో పాటు పన్ను చెల్లింపులు చేస్తున్నారా లేదా అనే విషయాలు ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు.

వార్డుల ఆధారంగా

మున్సిపాలిటీల పరిధిలో ఇప్పటి వరకు వార్డుల ఆధారంగా ఇంటి నంబర్లు ఉన్నాయి. మొదటి అంకెతో మొదలై మధ్యలో అడ్డగీత తర్వాత ఇంటి నంబర్లు ఉన్నాయి. బై నంబర్లు పెరగడంతో పరిస్థితి గందరగోళంగా ఉంది. ఇళ్ల చిరునామా తెలుసుకోవడం కష్టంగా మారింది. పెరిగిన నివాస గృహాల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని డిజిటల్ నంబర్లను ఇళ్లకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా లోకేషన్‌తో సమాచారం తెలుసుకునేలా యాప్‌ను రూపొందించారు.

డిజిటల్ నంబర్లు

నూతన విధానంలో ఇకపై మున్సిపాలిటీల పరిధిలో ఉన్న ఇళ్లకు డిజిటల్ నంబర్ ప్లేట్ ఇవ్వనున్నారు. పిన్‌కోడ్ తరహాలో రాష్ట్ర, జిల్లా, పురపాలిక, వార్డులను తెలిపేలా కోడ్ ఉంటుంది. డిజిటల్ ఇంటి నంబర్‌ను ఇంటర్‌నెట్‌లో నమోదు చేయడం ద్వారా గూగుల్ మ్యాప్ ద్వారా ఇంటి అడ్రస్ తెలుసుకునే అవకాశం ఉంది. అలాగే ఇంటి నంబర్‌తో పాటు బార్ కోడ్‌ను స్కాన్ చేస్తే పన్నుల చెల్లింపు, బకాయిల వివరాలు తెలుసుకోవచ్చు. కొత్తగా ఇండ్లు కట్టుకునే వారు ఇంటి ప్లాన్ ప్రకారమే కట్టాలి. ఇంటి ప్లాన్లు ఇచ్చే ప్లానర్ తప్పు చేస్తే వారి లైసెన్స్ రద్దు చేసే అవకాశం ఉంది. మున్సిపల్ పరిధిలో ఇంటి నిర్మాణాలు చేయాలంటే నిబంధనలు పాటించాలని అధికారులు కోరుతున్నారు.